క్లుప్తంగా

జీతాలు అందక ఇబ్బందులు



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

న్యాల్‌కల్(జహీరాబాద్): రెండు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మండల ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఎంపీడీఓ రాజశేఖర్ కొలాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ విధులతో పాటు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాల్లో తమ కీలకంగా పని చేశామని తెలిపారు. రెండు నెలలుగా జీతాలు రాకపోవడం వల్ల కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకొని తమకు వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు అబ్బాస్, మమత, చంద్రకళ, రవి, రాజు, సంగన్న, విఠల్, వైజ్యనాథ్, అప్పన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అంజిరెడ్డికి సన్మానం



అంజిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

మునిపల్లి(అందోల్): పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలుపొందిన అంజిరెడ్డిని మునిపల్లి మండల బీజేపీ నాయకులు శాలువా కప్పి సన్మానించారు. బుధవారం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు ఎమ్మెల్సీ ఇంటికి వెళ్లి మర్యాద పూర్వకంగా సన్మానించారు. కార్యక్రమంలో సంగయ్యస్వామి, చీలపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌లో ఫీల్డ్ విజిట్



వ్యవసాయ మార్కెట్‌లో విద్యార్థులు

సదాశివపేట(సంగారెడ్డి): ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎకనామిక్స్ విద్యార్థులు బుధవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థులు మార్కెట్ యార్డులోకి వచ్చిన పంటలను పరిశీలించి వాటి ధరలు, మార్కెట్‌యార్డు పనితీరు అమ్మకాలు పలు విషయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఎకనామిక్స్ మురళీకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.


స్వయంపాలనతో నాయకత్వ లక్షణాలు



స్వయంపాలనలో విద్యార్థులు, ఎంఈఓ

రాయికోడ్(అందోల్): స్వయంపాలన దినోత్సవంతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని ఎంఈఓ అంజయ్య అన్నారు. బుధవారం మండలంలోని హులిగేర ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన స్వయంపాలన కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు అఖిలేశ్, శ్రీనివాస్, శ్రీహరిలతో కలిసి పర్యవేక్షించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాబోధనతో పాటు విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడాపోటీలు నిర్వహిస్తూ.. పాఠశాలలకు ఉత్సాహంగా వచ్చేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సౌమ్య, నవీన్, విద్యార్థిని, విద్యార్థులు ఫార్మన్, వర్షిత్, నవాజ్, సృజన, సుకీర్తన, ఎల్లప్ప, రంజిత, శ్రీహరి, జాన్ పాల్గొన్నారు.

బాచేపల్లి ప్రాథమిక పాఠశాలలో..



బాచేపల్లిలో..

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట్ మండలం బాచేపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్‌గా వనశ్రీ, డీఈఓగా శ్రీజ, ఎంఈఓగా వెన్నెల, హెచ్ఎంగా కావ్య వ్యవహరించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎంఈఓ రాములు అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు రాజేందర్‌రాజు, సుహాసు, టీచర్లు నారాయణసింగ్, నరేష్, మాధవి, మానస పాల్గొన్నారు.

ఎండిన మొక్కలు.. వంగిన గ్రిల్స్



ప్రమాదకరంగా వంగిపోయిన డివైడర్ గ్రిల్స్

ముంబై– హైదరాబాద్ జాతీయ రహదారిపై సంగారెడ్డి చౌరస్తా సమీపంలో డివైడర్ మధ్యలో ఏర్పాటు చేసి గ్రిల్స్ చాలా చోట్ల వంగిపోయి ప్రమాదకరంగా మారాయి. రాత్రి సమయంలో రాడ్స్ కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. డివైడర్ మధ్యలో పెట్టిన మొక్కలు సైతం పూర్తిగా ఎండిపోయాయి. పూలకుండీలు కళావిహీనంగా కనిపిస్తున్నాయి. నెలల తరబడిగా ఇదే పరిస్థితి ఉన్నా సంబంధిత అధికారులు కనీసం అటువైపు చూడటం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



డివైడర్ మధ్యలో ఎండిపోయిన మొక్కలు

నిజమైన లబ్ధిదారులకే ఇళ్లు ఇవ్వాలి

జిన్నారం (పటాన్‌చెరు): నిజమైన లబ్ధిదారులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని మాదారం బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు గణేష్ మున్సిపల్, మండల పరిషత్తు అధికారులను విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో భాగంగా మొదటి విడత పైలెట్ ప్రాజెక్టుగా మాదారం గ్రామాన్ని తీసుకున్నారు. మాజీ ప్రజా ప్రతినిధులకు, స్థానిక నాయకులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అధికారులు ఇండ్లు ఉన్న వారిని గుర్తించి కేటాయించడం సమంజసం కాదన్నారు.

సామాన్యులకు బిగ్ రిలీఫ్

పడిపోయిన కూరగాయల ధరలు

నష్టపోతున్న అన్నదాతలు



జహీరాబాద్ సంతలో విక్రయిస్తున్న కూరగాయలు



ఓ రైతు పొలంలో విరగకాసిన టమాటాలు

జహీరాబాద్ టౌన్: గత నెల వరకు కూరగాయలు ధరలు అమాంతం పెరిగి కొనలేని, తినలేని పరిస్థితి ఉండేది. ప్రస్తుతం టమాటా నుంచి క్యారెట్ వరకు అన్ని కూరగాయల ధరలు కిలో రూ. 10 నుంచి రూ. 40కే వస్తున్నాయి. కూరగాయల పంటలు బాగా పండటం, కర్నాటక, మహారాష్ట్రాల నుంచి మార్కెట్‌కు పెద్ద మొత్తంలో రావడంతో డిమాండ్ లేక ధరలు తగ్గాయి. నిత్యావసరాలైన టమాటా, ఉల్లి, వెల్లులి, బంగాళదుంప, వంకాయ, చిక్కుడు, ధరలు తగ్గి నిలకడగా ఉన్నాయి, ఉల్లిపాయ ఒక్కటే కిలో రూ. 30 పలుకుతుంది. కిలో రూ. 200 ఉన్న వెల్లుల్లి వంద రూపాయలకు దిగివచ్చింది. బీన్స్, క్యాప్సికమ్, బీట్‌రూట్, ఇతర కూరగాయల ధరలు పూర్తిగా తగ్గాయి. తోటకూర, మెంతికూర, పాలకూర, పూదీన, కొత్తిమీర తదితర ఆకుకూరలు పది రుపాయలకే పెద్ద కట్ట ఇస్తున్నారు. కూరగాయల ధరలు నిలకడగా ఉండడంతో సామాన్యులకు మంచి ఉపశమనం పొందినట్లు అయింది. పంటలు పండిస్తున్న రైతులు మాత్రం నష్టపోతున్నారు. వేల రూపాయల పెట్టుబడి పెట్టి పండించిన పంటకు ధరలేక ఆందోళన చెందుతున్నారు. టమాటాకు పూర్తిస్థాయిగా ధరలేకుండా పోయింది. దీంతో టమాటా కొనేవారు లేక రైతులు కోయకుండా పొలాల్లోనే వదిలేస్తున్నారు. పెట్టిన పెట్టుబడి కూడా రాక అన్నదాతను నష్టాల బారిన పడుతున్నారు.

ప్రతిపనికి పైసలే..

- సింగూరు పంచాయతీ కార్యదర్శిపై డీఎల్పీఓకు గ్రామస్తుల ఫిర్యాదు
- ఇంటి నిర్మాణ అనుమతులకు రూ.40వేలు
- జనన, మరణ ధ్రువపత్రాలకు రూ. 5వేలు



ఫిర్యాదు పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

పుల్‌కల్(అందోల్): మండలంలోని సింగూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి రంగన్న అవినీతిపై బుధవారం డీఎల్పీఓ అనిత, ఎంపీఓ శ్రీకాంత్ విచారణ చేపట్టారు. గ్రామస్తులు కార్యదర్శి అవినీతిని ఒక్కొక్కటిగా బట్టబయలు ఆమెకు తెలియజేశారు. రిజ్వాన బేగం అనే వితంతువు ఇళ్లు కట్టుకోవడానికి అనుమతి కోరగా రూ.40 వేలతో పాటు ఆన్‌లైన్ ఫీజు పేర మరో పది వేలు వసూలు చేశాడని ఆమె ఆవేదనతో డీఎల్పీఓకు వివరించింది. వ్యవసాయ పనులు చేసుకునే తాము అంతంత డబ్బులు ఇవ్వడానికి నానా కష్టాలు పడ్డామని వాపోయారు. సింగూరు పునరావాస గ్రామం కావడంతో ప్రభుత్వం గ్రామస్తులకు ఇళ్ల పట్టాలు అందజేసింది. దీంతో ఆగ్రామంలో చాలా మంది నూతనంగా ఇళ్లు నిర్మించుకుంటున్నారు. కొత్తగా ఇళ్లు నిర్మించుకునే వారి వద్ద ఇలానే వసూలు చేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. జనన, మరణ ధ్రువపత్రాలకు రూ.4 వేల నుంచి. 5వేలు వసూలు చేశాడని మంజుల, సరిత, బక్కయ్య, సుకేష్ డీఎల్పీఓకు ఫిర్యాదు చేశారు. ప్రతి చిన్న ధ్రువపత్రానికి కూడా లంచం అడిగేవారని మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్, యువజన సంఘాల సభ్యులు ఆరోపించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

హౌసింగ్ పీడీ చలపతిరావు



ఇళ్ల నిర్మాణానికి ముగ్గు వేస్తున్న అధికారులు

వట్‌పల్లి(అందోల్): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు హౌసింగ్ పీడీ చలపతిరావు అన్నారు. బుధవారం అందోల్‌లోని నేరడిగుంట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా ఆయన ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన మార్గదర్శకాలను గురించి లబ్ధిదారులకు తెలియజేశారు. దరఖాసు చేసుకున్న ఇళ్లు లేని ప్రతిఒక్కరికీ మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో జోగిపేట ఏఎంసీ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి, రాష్ట్ర మార్కఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, హౌసింగ్ డీఈ మల్లేశం, ఎంపీడీఓ రాజేష్‌కుమార్, ఎంపీఓ సోమనారాయణ, శివరాజ్, రాజిరెడ్డి, పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంతో ప్రయోజనం

ఎంపీడీఓ అంజయ్య



గ్రామస్తులతో చర్చిస్తున్న ఎంపీడీఓ అంజయ్య

వట్‌పల్లి(అందోల్): ఉపాధి హామీ పనులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ అంజయ్య అన్నారు. బుధవారం మండలంలోని ఉసిరికపల్లి గ్రామంలో ఉపాధిహామీ పనుల నిర్వహణపై గ్రామస్తులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండలు పెరిగిపోవడంతో రైతులు ఉదయం సమయంలోనే పనులు పూర్తి చేసుకొని ఇంటికి చేరుకోవాలన్నారు. పని ప్రదేశాల్లో తాగునీటితో పాటు సరైన వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి శేఖర్ ఆయన వెంట ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వ సహకారం

సీడీసీ చైర్మన్ రాంరెడ్డి



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న రాంరెడ్డి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని సీడీసీ చైర్మన్ రాంరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఆరూర్లో రూ. 10లక్షల ఉపాధిహామీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 వందల యూనిట్ల వరకు ఉచిత కరెంట్ అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్దన్న పాల్గొన్నారు.

మాదిగలకు నమ్మక ద్రోహం



కలెక్టరేట్ వద్ద ఎమ్మార్పీఎస్ నిరవధిక దీక్ష

సంగారెడ్డి ఎడ్యుకేషన్: మాదిగలకు నమ్మక ద్రోహం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి తగిన గుణపాఠం చెప్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బుచ్చేంద్ర హెచ్చరించారు. బుధవారం ఎమ్మార్పీఎస్ అనుబంధాల సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద చేస్తున్న సమ్మె 2వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా బుచ్చేంద్ర మాట్లాడుతూ..ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత అయ్యేవరకు ఉద్యోగ నియామకాల ఫలితాలు, నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి మాదిగలకు ఇచ్చిన హామీని తుంగలో తొక్కుతూ గ్రూప్ 1, గ్రూప్ 2, ఫలితాలు విడుదల చేశారని మండిపడ్డారు.

ఎమ్మార్పీఎస్ నేతల నిరాహార దీక్ష

జహీరాబాద్: ఎస్సీ వర్గీకరణ జరిగేంతవరకు ఉద్యోగ పరీక్షల ఫలితాలను నిలిపివేయాలని డి మాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు నిరాహార దీక్ష చేపట్టారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద దీక్ష చేపట్టారు. గత నోటిఫికేషన్లకు వర్గీకరణ వర్తింపజేస్తామని సీఎం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాదిగ మహాజన సోషలిస్టుపార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జైరాజ్, అరుంధతి సంఘం ఉపాధ్యక్షుడు జయరాజ్, నాయకులు పాల్గొన్నారు.

చైర్మన్ పదవి మాదిగలకే ఇవ్వాలి

నారాయణఖేడ్: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని మాదిగలకే కేటాయించాలని డివిజన్ ఎమ్మార్పీఎస్ కన్వీనర్ జీవన్‌కుమార్ డిమాండ్ చేశారు. వర్గీకరణ చట్టం అమలయ్యే వరకు ఉద్యోగ నియామక పరీక్షల ఫలితాలు నిలిపేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఖేడ్ తహసీల్ మైదానంలో చేపట్టిన నిరసనదీక్ష రెండవరోజు బుధవారం కొనసాగింది.

విద్యార్థికి అస్వస్థత



జహీరాబాద్ టౌన్: పట్టణంలోని తపస్వ జూనియర్ కళాశాల కేంద్రంలో పరీక్ష రాస్తుండగా ఓ విద్యార్థి అస్వస్థతకు గురైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. మొగుడంపల్లి మండలంలోని మందగుబ్బడి తండాకు చెందిన విద్యార్థిని సుజాత పట్టణంలోని హీరా కళాశాలలో వొకేషనల్‌లో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతుంది. తపస్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాస్తుండగా హాల్‌లో కళ్లు తిరిగి అస్వస్థతకు గురైంది. సిబ్బంది ఆమెను ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఆమెకు చికిత్స అందించగా ఆరోగ్యం నిలకడగా ఉంది. అస్వస్థత కారణంగా ఆమె పరీక్ష రాయలేకపోయింది.

గజేంద్ర ఆశ్రమంలో కాలకీర్తన

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం అంతర్‌గాం గజేంద్ర ఆశ్రమంలో బుధవారం కాలకీర్తన నిర్వహించారు. ఆశ్రమం పీఠాధిపతి కరణ్ గజేంద్ర భారతి మహారాజు ప్రవచనం చేశారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి ఆశ్రమంలోని రుక్మిణి పాండురంగ దేవతమూర్తులకు పూజలు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నారాయణఖేడ్: నిజాంపేట్ మండలంలోని చందర్‌నాయక్ తండాకు చెందిన పాత్‌లోత్ హరిసింగ్ (59) హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కల్హేర్ పోలీసులు బుధవారం తెలిపారు. మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో.. మూర్ఛవ్యాధితో ఇంటి ముందు పడిపోవడంతో తీవ్ర గాయాలపాలయ్యాయి. గాయపడ్డ హరిసింగ్‌ను హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మరణించాడు.


టెక్నికల్ కోర్సులతో ఉపాధి అవకాశాలు



హత్నూర: సర్టిఫికెట్లు అందజేసిన ప్రిన్సిపాల్

హత్నూర(సంగారెడ్డి): టెక్నికల్ కోర్సులతో ఉపాధి అవకాశాలు పొందవచ్చని జహీరాబాద్ మహీంద్రా అండ్ మహీంద్రా సీఎస్ఆర్ జనరల్ మేనేజర్ అవిలాష్ ద్వివేది పేర్కొన్నారు. హత్నూర ఆర్‌ఐటీఐలో సెంటర్ ఫౌండేషన్ సహకారంతో ఐటీఐ విద్యార్థులకు మూడు నెలలుగా హానర్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా అసెంబ్లీ లైన్ ఆపరేటర్ కోర్సులో శిక్షణ ఇచ్చారు. బుధవారం శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ ఉపాధి అవకాశాలు పొందాలని సూచించారు. అసెంబ్లీ లైన్ ఆపరేటర్లు మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో మహీంద్రా అండ్ మహీంద్రా హెడ్ గణేష్ డీజీఎం అడ్మిన్ సెక్యూరిటీ డీఎస్ఆర్ ప్రదీప్ గౌడ్, కార్పొరేట్ సీఎస్ఆర్ బీజీఎం మదన్‌రామ్, అడ్మిన్ సునీల్ సాదంగి, సెంటర్ ఫౌండేషన్ డైరెక్టర్ ధ్రువ్ మిట్టల్, సీనియర్ మేనేజర్ దర్శన్ సావంత్, ప్రిన్సిపాల్ సుబ్బలక్ష్మి, ట్రైనర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో లేని అధికారులు



అధికారులు రాకపోవడంతో ఖాళీగా కుర్చీ

జిన్నారం (పటాన్‌చెరు): నూతనంగా ఏర్పడిన గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధి గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించడంలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పలు గ్రామాల ప్రజలు మున్సిపాలిటీ కార్యాలయానికి వెళ్లగా ఉ.11 గంటలవుతున్న అధికారులు విధుల్లోకి రాకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. మున్సిపల్ పరిధి మాదారంలో వారం రోజులుగా నీటి సమస్యను ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి ఒక్క అధికారి కూడా గ్రామాల్లో పర్యటించలేదని మండిపడ్డారు. గ్రామపంచాయతీగా ఉన్నప్పుడు సమస్యలకు ఎప్పటికప్పుడు పరిష్కారం దొరికేదని అన్నారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

డయాలసిస్ సెంటర్ సందర్శన



డయాలసిస్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఉజ్వల్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని డయాలసిస్ సెంటర్‌ను కాంగ్రెస్ నేత ఉజ్వల్‌రెడ్డి బుధవారం సందర్శించారు.రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీధర్ మరిన్ని పడకలు అవసరముందని ఆయన దృష్టికి తెచ్చారు. మంత్రి దామోదరతో మాట్లాడి మంజూరు చేయిస్తాననిచెప్పారు.

సంక్షిప్త వార్తలు

◆ **పశువుల పాక నిర్మాణం పరిశీలన**

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని తడ్కల్ గ్రామ శివారులో ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్మించిన పశువుల పాకను జిల్లా అదనపు డీఆర్డీఓ బాలారాజు బుధవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన రెడ్డి సాయిలు తన సొంత పట్టాభూమిలో నిర్మించిన పాకను చూసి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి నాగేశ్వర్‌రావు, ప్లాంటేషన్ అధికారి మణికుమార్, ఎంపీడీఓ సత్తయ్య, ఎంపీఓ నర్సింలు పాల్గొన్నారు.

◆ **మందుబాబులకు జరిమానా**

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా 11 మందికి రూ. 1500 చొప్పున, మరో వ్యక్తికి వెయ్యి రూపాయల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ **పాఠశాలల తనిఖీ**

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలంలో పాఠశాలలను ఎంఈఓ శ్రీనివాస్ తనిఖీ చేశారు. తుకారం తండా, సుర్య తండా, బిబ్యా తండా, మూన తండా పాఠశాలను సందర్శించారు. టీచర్లు, విద్యార్థుల హాజరు, రికార్డులు పరిశీలించారు.

◆ **ఘనంగా పుష్కర బ్రహ్మోత్సవం**



రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని కంచి కామాక్షి అమ్మవారి ఆలయంలో పుష్కర బ్రహ్మోత్సవాల ముగింపు కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు

◆ **స్థల వివాదంలో ఘర్షణ**

పటాన్ చెరు టౌన్: ఓ స్థలం విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకున్న ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఓ వెంచర్‌లోని ఖాళీ స్థలంలో బీడీఎల్ ఓడీఎఫ్ హౌసింగ్ సొసైటీ సభ్యులు కడియలు పాతుతుండగా, వెంచర్ యజమానులమంటూ మరో వర్గం అక్కడికి బౌన్సర్‌లతో రావడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగి తోపులాట చోటుచేసుకుంది. అదే సమయానికి పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టడంతో గొడవ సద్దుమణిగింది. ఏదైనా ఉంటే కోర్టులో తెల్చుకోవాలని ఇక్కడ ఘర్షణ వాతావరణం సృష్టించొద్దని సీఐ వినాయకరెడ్డి హెచ్చరించారు.

◆ **అక్రమ షెడ్డు నిర్మాణంపై ఆందోళన**



జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీలో నిబంధనలకు విరుద్ధంగా షెడ్డు నిర్మాణం చేపట్టడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీకి కూతవేటు దూరంలో ఎలాంటి అనుమతులు లేకుండా షెడ్డు నిర్మాణం చేపడుతున్నా అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అధికారులు తనిఖీ చేసి అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమ నిర్మాణాలను నియంత్రించడంలో అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.